టీవీలో వరల్డ్ కప్పు కిరికెట్టు మ్యాచ్‌లు 'లైవ్' ప్రసారం జరుగుతున్న రోజుల్లో మా నాన్నగారి స్నేహితులు నిరంజన్‌గారు భార్యా సమేతంగా మా యింటికి దిగారు. వారం రోజులు వుండి మా చుట్టు ప్రక్కల చూడదగ్గ ప్రదేశాలన్నీ చూసి వెడతారట. వాళ్లకు దగ్గరువుండి అన్నీ చూపించే బాధ్యత నామీద వేసారు మా నాన్నగారు.

మా మిత్రులతో నాకు వచ్చిన కష్టం గురించి చెప్పాను. నిరంజన్‌గారు ఆకాశవాణిలో పనిచేస్తున్నారనీ, ఆయన భార్య శకుంతలగారు 'సాహితి' పత్రికకు ఎడిటర్‌గా పనిచేస్తున్నారనీ యధాలాపంగా చెప్పాను. మా వాళ్లు ఒక్కసారిగా ఎలర్ట్ అయ్యారు. "రేడియోలో పని చేసే నిరంజన్‌గారు మీ నాన్నగారి స్నేహితులా? 'సాహితి' ఎడిటర్ శకుంతలగారు నిరంజన్‌గారి భార్యా?" అంటూ ఆశ్చర్యం ప్రకటించి వాళ్లను పరిచయం చెయ్యమని కోరడంతోపాటు వాళ్లను తిప్పే బాధ్యత తమకు అప్పగించమని ప్రాధేయపడ్డారు. నాకు అంతకన్నా కావలసిందేముంది అలానే చేశాను.

నిరంజన్‌గారూ, శకుంతలగారూ ఉన్న వారంరోజుల పాటు వాళ్ళు కాలు క్రింద పెట్టకుండా టాక్సీలో త్రిప్పి అన్ని చూపించి, దగ్గరుండి మరీ ట్రైను ఎక్కించారు. ఏమిటో వీళ్ల తాపత్రయం అనుకున్నాను. నెలరోజుల తరువాత మా నాన్నగారు "నిరంజన్ ఫోన్ చేశాడు. మీ ఫ్రెండ్సుతో చెప్పు, రేపు ఫిఫ్తున వీళ్ల కవి సమ్మేళనం రికార్డింగ్ అట" అన్నారు. నేను ఆ కబురు చెప్పడానికి బయలుదేరాను. వాళ్ళు 'శాంతి భవన్ లాడ్జి'లో వున్నారని తెలిసి అక్కడకు వెళ్ళాను.

నన్ను చూసి 'నువ్వెందుకు యిలా వచ్చావు?' అన్నట్లుగా చూశారు. ఆ గదిలో వాళ్ళు ఓ పెద్దమనిషికి అతి మర్యాదగా వంగి వంగి సేవలు చేస్తూ మందు తాగిస్తున్నారు. అక్కడి వాతావరణం చూసి నేను కంగారుపడ్డాను. వాళ్లను బయటకు పిలిచి నేను మోసుకువచ్చిన వార్త వాళ్ల చెవిని వేసాను. నన్ను కౌగలించుకుని గాల్లో తిప్పేసారు.

"చాలా థాంక్సురా! నీ వల్ల నిరంజన్‌గారు పరిచయమయ్యారు. రేడియో అవకాశం వచ్చింది. శకుంతలగారు మొన్ననే 'సాహితి' పత్రికలో మా కవితలు వేశారు. మా సంకలనాల మీద మంచి రివ్యూలు వేయించారు. గదిలో వున్నాయన దూరదర్శన్‌లో పనిచేస్తున్న పానకాలరావుగారు. వచ్చే నెలలో మా కవిసమ్మేళనం దూరదర్శన్‌లో ఏర్పాటు చేస్తామన్నారు. ఇక ఆంధ్రదేశమంతటా కవులుగా మా పేరు మారుమ్రోగిపోతుంది" అంటూ మహదానంలో తలమునకలైపోతున్నారు. నాకు అక్కడ పనేముంది వాళ్ళను విడిచి బయటకు వచ్చేసాను.

మంచి కవిత్వం రాయడానికి శ్రమించడంకన్నా కవులుగా తమని ప్రమోట్ చేసుకోవడానికే ఎక్కువ శ్రమిస్తున్నారు. మా వాళ్ళ చలామణీ బలహీనత చాలా ఖర్చుతో కూడుకున్న భయంకరమైన జాడ్యం. శాస్త్రకారులు దీనికి మందు కనిపెట్టవలసి వుంది.

-వి.వి.సుబ్బరాజు (కాకినాడ)

# ప్రాప్తం

సత్యనారాయణరావు, అనసూయమ్మలది అన్యోన్య దాంపత్యం. గుడి పూజారి అయిన సత్యనారాయణకు నెలజీతం, పెద్దలు ఇచ్చిన ఒక చిన్న పెంకుటిల్లు తప్ప వేరే ఆస్తిపాస్తులు లేవు. ఎన్నో పూజలు, నోముల తర్వాత పుట్టిన కొడుక్కి 'ఆదిశంకర్' అని పేరు పెట్టుకున్నారు. చదువు మీద అతడు కనబరిచే ఆసక్తిని గమనించి, తల తాకట్టుపెట్టైనా సరే అతణ్ణి డాక్టరు చేయాలని నిశ్చయించుకున్నారు. సెమిస్టర్ ఫీజులకు, పుస్తకాలకు చేతికి అందే జీతం సరిపోక ఊరి నిండా అప్పులు చేసే దుస్థితికి చేరారు.



పల్లెటూరు నుండి పట్నంకు వెళ్లిన ఆదిశంకర్‌కు మాత్రం చదువుకన్నా అక్కడి హైక్లాస్ పోకడలు బాగా నచ్చాయి. తాను కూడా కార్లలో తిరుగుతూ, ఖరీదైన సూట్లు వేసుకుని, అద్దాల మేడలో జీవించాలని కలలు కనేవాడు. ఆ ఊహల్లో తేలిపోతూ అతడు పుట్టి పెరిగిన ఊరుని, పేదరికాన్ని అసహ్యించుకోసాగాడు. రెండేళ్ళలోనే తన పేరుని 'ఆదిశంకర్' నుండి 'ఆదీష్'గా మార్చుకుని తన స్నేహితుల చేత అలా పిలిపించుకోసాగాడు.

ఆఖరుకు, తమ నోరు కట్టుకుని కొడుక్కి అన్నీ అమర్చిపెడుతున్న తల్లిదండ్రులు హాస్టల్‌కి వస్తే, వారిని తన ఇంట్లోని పనివాళ్ళుగా తన స్నేహితులకు పరిచయం చేసే స్థాయికి ఎదిగిపోయాడు. చదువు పూర్తయ్యాక తాను ప్రేమించిన క్లాస్‌మేట్, స్నిగ్ధను రిజిస్టర్ పెళ్ళి చేసుకుని పట్నంలోనే ప్రాక్టీస్ పెట్టాడు.

చివరకు కొడుకు పెళ్ళి చూసే యోగం కూడా లేకపోయిందనుకున్న ఆ పుణ్యదంపతులు కన్నీరుమున్నీరుగా ఏడ్చారు. ఆ బాధతోనే సత్యనారాయణరావు గతించాడు. చేసిన అప్పులకు ఉన్న ఇల్లు పోగొట్టుకుని చివరకు కట్టుబట్టలతో మిగిలిన అనసూయమ్మ, తమ దూరపు బంధువైన ఆటోడ్రైవర్ అసిరయ్య ఇంట్లో తలదాచుకునేందుకు పట్నం వెళ్ళింది. కొడుకుని కలుసుకోవాలనీ, అతడితో ఏదో చెప్పాలని తపించిన ఆ పేదతల్లి, ఆమె కోరిక తీరకుండానే మరణించింది.

కొంతకాలం తర్వాత ఒకరోజు రెస్టారెంట్‌లో కూర్చుని టిఫిన్ చేస్తున్న ఆదిశంకర్ - ఉరఫ్ ఆదీష్ అతి ఖరీదైన కారులో అత్యంత ఖరీదైన సూటు వేసుకుని కుటుంబ సమేతంగా పక్కనే ఉన్న ఫైవ్‌స్టార్ హోటల్‌కి వెళ్తున్న అసిరయ్యను చూసి అవాక్కయ్యాడు. ఒకసారి తనని క్లినిక్‌లో డ్రాప్ చేసిన ఆటోడ్రైవర్‌గా అతణ్ణి గుర్తుపట్టాడు. ప్రక్కనే కూర్చున్న కొలీగ్, రమేష్‌తో ఈ విషయం చెప్పగా-

"అసిరయ్య ఒకప్పుడు ఆటోడ్రైవర్ అయినప్పటికీ, అతడి దూరపుబంధువు ఒకతను అనుకోకుండా కొన్న లాటరీ టిక్కెట్టుకు కోటి రూపాయలు వచ్చాయన్న విషయం తెలియకముందే చనిపోయాడు, అతడి భార్య ఆ విషయం కొడుక్కి చెప్పాలని పట్నం చేరుకుని అసిరయ్య ఇంట్లోనే తలదాచుకుని ఎన్నిసార్లు కొడుకుని కలవాలనుకున్నా అతడు ఛీ కొట్టాడు. కన్నతల్లిని ఇంకా పేద తల్లిని అనే అనుకున్న ఆ పుత్రరత్నం ఆమె ముఖం మీదే తలుపులు వేశాడు. కన్నకొడుకు చేత అంతటి భయంకరమైన అవమానం పొందిన ఆమె, తనకు నీడనిచ్చిన అసిరయ్యకే ఆ లాటరీ టిక్కెటు అప్పగించేసి కన్ను మూసింది. దాంతో అతడిప్పుడు ఈ సిటీలోనే ధనవంతుడు అయిపోయాడు" అంటూ ముగించాడు రమేష్. అతడి మాటలు విన్న ఆదిశంకర్‌కి లోకమంతా గిర్రున తిరుగుతున్నట్టు అనిపించింది. అందుకే అంటారు దేనికైనా ప్రాప్తం ఉండాలని.

-జె.ఉషావిజయ్
(భీమవరం)